సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 17 । మే । 2024



విశేషంగా ఆర్జిత సేవలు 8లో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఆర్జిత సేవల్లో భాగం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు.



ఘనంగా పంచామృతాభిషేకం

విశాఖ: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో త్రికాల పంచామృతాభిషేకం నిర్వహించారు.



విక్రయానికి శ్రీవారి అగరబత్తి

విశాఖ: రుషికొండలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో టీటీడీ తయారు చేసిన అగరబత్తి అందుబాటులో ఉన్నాయి.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల భద్రత

- పరిశీలించిన కలెక్టర్ విజయ సునీత, ఆర్వోలు భావన వశిష్ట, అభిషేక్



పాడేరులోని స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత, పాడేరు ఆర్వో భావన వశిష్ట

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పాడేరు,అరకులోయ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. గురువారం ఆమె పాడేరు, అరకులోయ ఆర్వోలు భావన వశిష్ట, వి.అభిషేక్‌లతో కలిసి స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఇతరులు డిగ్రీ కళాశాల ప్రాంగణంలోకి ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాలు నిరంతరం, సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.

సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతుల్లేవు

- పాడేరు సీఐ నవీన్‌కుమార్

సాక్షి,పాడేరు: ఈనెల 19 నుంచి జరగనున్న పాడేరు మోదకొండమ్మతల్లి ఉత్సవాలకు సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాలకు ఎలాంటి అనుమతులు లేవని పాడేరు సీఐ నవీన్‌కుమార్ గురువారం తెలిపారు. ఇప్పటికే 144సెక్షన్ అమలులో ఉందన్నారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో పోలీసుశాఖ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. మోదకొండమ్మతల్లి పూజ కార్యక్రమాలు, ఊరేగింపునకు మాత్రం ఎలాంటి అంక్షలు లేవన్నారు. జూనియర్ కళాశాల మైదానంలోని ఎగ్జిబిషన్‌ను కూడా నిలుపుదల చేశామని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలను జరుపుకోవాలంటే వచ్చే నెల నాల్గవ తేదీ తరువాత అనుమతులు ఇస్తామని ఆయన తెలిపారు.


చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- వైద్యారోగ్యశాఖ రాష్ట్ర నోడల్ ఆఫీసర్ రమేష్

కూనవరం: చిన్నపిల్ల ఆరోగ్య విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ సూచించారు. మండల పరిధిలోని కోతులగుట్ట ప్రభుత్వాస్పత్రిలో ఎస్ఎన్‌సీయూ (చిన్నపిల్లల) యూనిట్‌ను గురువారం పరిశీలించారు. 30 రోజుల శిశువులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. పిల్లలకు అందిస్తున్న మందులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చింతూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ కె. మహేష్ బాబు, ఎస్ఎన్‌సీయూ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుభాష్, చర్మవ్యాధుల నిపుణుడు డాక్టర్ టీవీ శేశిరెడ్డి, హెడ్ నర్స్ బిజ్జి, సిబ్బంది పాల్గొన్నారు.

45 రోజుల్లో 10 మిలియన్ మెట్రిక్ టన్నుల ఎగుమతి

- నరకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డ్
- 2024-25లో శరవేగంగా నరకు హ్యాండ్లింగ్
- చైర్మన్ అంగముత్తు



విశాఖపట్నం పోర్టు

సాక్షి, విశాఖపట్నం: సరుకు హ్యాండ్లింగ్‌లో మేజర్ పోర్టులతో పోటీ పడుతూ నంబర్ వన్ దిశగా అడుగులు వేస్తున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) మరో మైలురాయిని అధిగమించింది. కేవలం 45 రోజుల్లోనే 10 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు ఎగుమతి, దిగుమతులు నిర్వహించి రికార్డు సృష్టించింది. 2024–25లో శరవేగంగా సరుకు హ్యాండ్లింగ్ నిర్వహణ కొనసాగుతోందని పోర్టు చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం 90 ఎంఎంటీ లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వెల్లడించారు. 2023–24లో 10 ఎంఎంటీకి 47 రోజులు పట్టగా.. ఈసారి రెండు రోజుల ముందుగానే లక్ష్యాన్ని చేరుకున్నట్లు చైర్మన్ వివరించారు.

అరకు కాఫీ.. మేడిన్ డౌనూరు

దేశంలోని టాప్ కాఫీ బ్రాండ్స్‌లో ఒకటిగా ఎదిగిన అరకు కాఫీని.. ప్రజలకు అందించేందుకు గిరిజన సహకార సంస్థ కార్యాచరణతో ముందుకు సాగుతోంది. ఎప్పటికప్పుడు సరికొత్త ఫ్లేవర్స్‌లో కాఫీ ప్రియులకు అరకు కాఫీని పరిచయం చేస్తున్న జీసీసీ.. ఇకపై మేడిన్ ఆంధ్ర లేబుల్‌తో మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు డౌనూరులో రూ.3 కోట్ల వ్యయంతో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను సిద్ధం చేస్తోంది.

- ఇప్పటివరకు బెంగళూరులో... ఇకపై డౌనూరులోనే తయారీ
- క్యూరింగ్, ప్యాకింగ్ మొత్తం ఇక్కడే..
- కాఫీ ప్రాసెసింగ్‌కు జీసీసీ సహకారం
- త్వరలో 'మేడిన్ ఆంధ్ర' పేరుతో కాఫీ సాచెట్స్, టిన్స్ విడుదల





సాక్షి, విశాఖపట్నం: సేంద్రియ పద్ధతుల్లో తయారయ్యే అరకు కాఫీ అంటే తెలియనివారంటూ ఉండరు. ఏజెన్సీలోని వాతావరణమే అరకు కాఫీ రుచికి ప్రధాన కారణం. ఇక్కడ పండే అరబికా రకం కాఫీ రుచికి పారిస్, జపాన్, దక్షిణ కొరియా, స్విట్జర్లాండ్ దేశాల్లోని నగరాల ప్రజలు సలాం కొట్టారు. అందుకే.. 2018లోనే బ్రెజిల్, సుమత్రా, కొలంబోతో పాటు ఇతర దేశాలను వెనక్కు నెట్టేసి ప్రిక్స్ ఎపిక్యూర్–2018 పోటీల్లో అరకు కాఫీ బంగారు పతకాన్ని సాధించింది. ఇలాంటి చరిత్ర ఉన్న అరకు కాఫీ ప్రాసెసింగ్ అంతా ఇకపై ఆంధ్రలోనే కానుంది.

సేంద్రియ విధానం వల్లే గిరాకీ..

అరకు కాఫీ టేస్టీగా ఉండటమే కాకుండా సేంద్రియ విధానంలో పండించడం వల్ల గిరాకీ సొంతం చేసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మొత్తం 2.27 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు విస్తరించి ఉన్నాయి. ఈ తోటల్లో ఏడాదికి 71,258 మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో ప్రస్తుతానికి రెండు క్లస్టర్లలో 2,258.55 హెక్టార్ల విస్తీర్ణంలో ఆర్గానిక్ పద్ధతుల్లో కాఫీని పండిస్తున్నారు. చింతపల్లి క్లస్టర్ వరసగా మూడో ఏడాది కూడా నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌పీవోపీ) స్టాండర్డ్స్ సర్టిఫికెట్ తీసుకోగా.. జీకే వీధి క్లస్టర్ ఇప్పటికే రెండు సార్లు స్కోప్ సర్టిఫికెట్ దక్కించుకుంది. మూడో ఏడాదీ సేంద్రియ సాగుకు సంబంధించి స్కోప్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంది.

2,600 మంది టాప్ గ్రేడ్ రకం సాగు..

ప్రస్తుతం కాఫీ గింజల క్యూరింగ్, ప్రాసెసింగ్ అంతా బెంగళూరులో జరుగుతోంది. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీతో టైఅప్ కారణంగా ప్రాసెసింగ్ వ్యయం పెరుగుతోంది. డౌనూరులో క్యూరింగ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభమైతే ఈ ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుంది. ఏజెన్సీలోని 11 మండలాల్లో 2,27,021 ఎకరాల విస్తీర్ణంలో కాఫీ తోటలున్నాయి. మొత్తం 93,521 మంది గిరిజనులు కాఫీ సాగులో పాల్గొంటున్నారు. వీరిలో 2,600 మంది రైతులు టాప్ గ్రేడ్ రకాన్ని సాగు చేస్తున్నారు. వీరి నుంచి సేకరించిన బీన్స్‌ని ఫిల్టర్ కాఫీ ఉత్పత్తి కోసం బెంగళూరుకు, ఇన్‌స్టెంట్ కాఫీ పౌడర్ ఉత్పత్తి, రిటైల్ మార్కెటింగ్‌కు ఏలూరు పంపిస్తుంటారు. ఇకపై ఇక్కడి నుంచే చేసేలా క్యూరింగ్ వ్యవస్థ సిద్ధమవుతోంది. త్వరలోనే మేడిన్ ఆంధ్ర ప్రదేశ్ పేరుతో అరకు కాఫీ ఉత్పత్తులు మార్కెట్‌లోకి రానున్నాయి.

కాఫీకి మార్కెటింగ్ సౌకర్యం

గిరిజన రైతుల జీవనోపాధి, ఆదాయ స్థాయిలను మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా సీఎం జగన్ ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ అభివృద్ధికి ప్రణాళికపరంగా చర్యలు చేపట్టారు. పాడేరు ఏజెన్సీ పరిధిలోని 11 మండలాల్లో సుమారు లక్షకు పైగా ఎకరాల్లో కాఫీ ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. గిరిజనులు పండించిన కాఫీకి జీసీసీ ద్వారా మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించారు. ఎన్నడూ లేని విధంగా గిరిజన రైతు పండించిన కాఫీని జీసీసీ భారీ మద్దతు ధరకు కొనుగోలు చేసింది. పార్చ్‌మెంట్ కాఫీ కిలోకి రూ.285, చెర్రీ కాఫీ కిలోకి రూ.145 మార్కెట్ ధరగా ప్రకటించి కొనుగోలు చేయడంతో మధ్యవర్తుల దోపిడీ ఆగింది. తద్వారా గిరిజనుల జీవనోపాధికి తగిన ఆదాయాన్ని ప్రభుత్వం జీసీసీ ద్వారా అందించింది. 2023–24లో ఇప్పటి వరకూ 564.48 మెట్రిక్ టన్నుల ముడి కాఫీని రైతుల నుంచి జీసీసీ కొనుగోలు చేసి రూ.13.39 కోట్లను వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేసింది.

ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఉపయోగాలివీ..

రాష్ట్ర ప్రభుత్వం నర్సీపట్నం సమీపంలోని డౌనూరులో ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేసింది. 2023 అక్టోబర్ 20న ఈ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఈ యూనిట్ వద్ద గిరిజనులకు పెద్ద ఎత్తున లాభం కలగనుంది. జీసీసీ ముడి కాఫీని క్యూరింగ్ చేయడం నుంచి రోస్ట్ చేయడం, గ్రైండింగ్, బ్లెండింగ్, ప్యాకేజింగ్ మొదలైన అన్ని ఫీచర్లని ఇక్కడే నిర్వహించనుంది. దీని వల్ల కాఫీ క్యూరింగ్, తయారీ కోసం ఏపీఎఫ్‌డీసీ, ప్రైవేట్ పార్టీలపై ఆధారపడాల్సిన అవసరం లేదు. ఇది గిరిజన కాఫీ సాగుదారులకు కూడా ప్రయోజనం చేకూరుతుంది. ఎందుకంటే కాఫీ తయారీకి రవాణా, మొదలైన ఓవర్‌హెడ్ చార్జీలు తగ్గుతాయి. కాబట్టి గిరిజనులకు జీసీసీ మెరుగైన ధర చెల్లించే అవకాశాలు పెరుగుతాయి.

నాణ్యతలో నంబర్‌వన్‌గా..



ఐదేళ్ల కాలంలో గిరిజనుల జీవితాల్లో జీసీసీ ఎన్నో మార్పులు తీసుకొచ్చింది. కోవిడ్ సమయంలోనూ వారి ఉత్పత్తులను సేకరిస్తూ.. గిట్టుబాటు ధర కల్పిస్తూ.. అన్ని విధాలా చేదోడుగా నిలిచాం. అందుకే కరోనా సమయంలోనూ జీసీసీ టర్నోవర్ తగ్గలేదు. గిరిజనులు సేకరిస్తున్న అన్ని ఉత్పత్తులు నాణ్యతలో నంబర్ వన్‌గా ఉన్నాయి. అందుకే తిరుమల తిరుపతి దేవస్థానానికి జీసీసీ ఉత్పత్తులు అందించే అవకాశాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించింది. జీసీసీ ఉత్పత్తులు తిరుమలలో వినియోగిస్తుండటం వల్ల ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. అంతేకాకుండా గిరిజనులకు మరింత మేలు కలుగుతోంది. కాఫీ రేటుని ఒకేసారి రూ.120 అదనంగా పెంచాం. కాఫీ గింజలు సేకరించినప్పుడు గతంలో రెండు దఫాలుగా అంటే.. సీజన్ మొదట్లో, చివర్లో పేమెంట్ చేసేవారు. ఇకపై ఇక్కడే ప్రాసెసింగ్ జరిపే ప్రక్రియ ప్రారంభమైతే.. ఆంధ్రాలోనే తయారీతో పేరుతో కాఫీ ఉత్పత్తులను విడుదల చేస్తాం.

– శోభా స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

అడ్డుమండ– పాడేరు రింగ్ రోడ్డు పరిశీలన

- మోదమ్మ జాతరలో బస్సులకు ఇదే మార్గంలో డైవర్షన్
- ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు
- కలెక్టర్ విజయ సునీత ఆదేశం



అడ్డుమండ వద్ద తాత్కాలిక కాజ్‌వేను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత, ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: ఈనెల 19వతేదీ నుంచి పాడేరులో మూడురోజుల పాటు జరిగే మోదకొండమ్మ జాతర సమయంలో బస్సులకు వేరే మార్గం ఇవ్వాలని కలెక్టర్ ఎం.విజయసునీత అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలకు సంబంధించి గురువారం అడ్డుమండ–పాడేరు రింగ్‌రోడ్డును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాల మూడు రోజులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా విశాఖపట్నం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను వంతాడపల్లి చెక్‌పోస్టు నుంచి తుంపాడ, అడ్డుమండ, సన్యాసమ్మపాలెం, అడారిమెట్ట, చింతల వీధి మీదుగా పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటాయన్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ సంస్థ అదనంగా బస్సులను నడపాలన్నారు. అడ్డుమండ కాజ్‌వేకు మరమ్మతులు చేపట్టి బస్సుల రాకపోకలకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. డిపో మేనేజర్ వి.శ్రీనివాసరావు,ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు,సీఐ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

గాంధారి ఆకులు తిని పశువులు మృత్యువాత 8లో



స్ట్రాంగ్‌రూమ్‌కు పోస్టల్ బ్యాలెట్లు



స్ట్రాంగ్‌రూమ్‌కు సీల్ వేయిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్



పోస్టల్ బ్యాలెట్ పెట్టెలను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

పార్వతీపురం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అరకు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, పాడేరు నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్లను గురువారం పార్వతీపురం తరలించారు. అక్కడి డా.వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో రాజకీయపార్టీల ప్రతినిధులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారుల సమక్షంలో భద్రపరిచారు. అరకు పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నిషాంత్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్ వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా రాజకీయపార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ సహాయ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, పాలకొండ, సాలూరు, కురుపాం, పార్వతీపురం శాసనసభ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు సి.విష్ణుచరణ్, శుభం బన్సాల్, వి.వి.రమణ, కె.హేమలత, కంట్రోల్ రూం ఇన్‌చార్జి ఎస్‌డీసీ ఆర్.సూర్యనారాయణ, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, 234 బెటాలియన్ బి.కంపెనీ సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినిత, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన జెన్‌కో డైరెక్టర్



పైపు లైన్ పనులను పరిశీలిస్తున్న జెన్‌కో డైరెక్టర్ సత్యనారాయణ

మోతుగూడెం: లోయర్ సీలేరు పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాన్ని ఏపీ జెన్‌కో డైరెక్టర్ ఏవీ సత్యనారాయణ గురువారం సందర్శించారు. ఐదు, ఆరు యూనిట్ల నిర్మాణ పనుల వివరాలను స్థానిక అధికారుల నుంచి తెలుసుకున్నారు. వాల్వ్ హౌసింగ్ నుంచి పవర్ హౌస్ వరకు జరుగుతున్న పెన్‌స్టాక్, పవర్‌హౌస్ వద్ద కెనాల్ కాంక్రిట్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన ఫోర్‌బే డ్యాం వద్ద 16 కిలోమీటర్ల పవర్‌కెనాల్‌ను పరిశీలించారుద్దాయన వెంట చీఫ్ బి.శ్రీధర్, ఎస్ఈ సివిల్ ప్రశాంత్‌కుమార్, డీఈ బాలకృష్ణ, వరప్రసాద్, వరప్రసాద్, ఏఎస్ఓ సూర్యమోహన్ పాల్గొన్నారు.

క్షయ నివారణే లక్ష్యం : డీఐవో



లంబసింగి పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న డీఐవో సాధన



వ్యాక్సినేషన్ వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

కొయ్యూరు: క్షయను 2025 చివరి నాటికి పూర్తిగా నివారించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉందని డీఐవో సాధన తెలిపారు. గురువారం ఆమె డౌనూరు ఆరోగ్యకేంద్రంలో బీసీజీ టీకాల కార్యక్రమానిన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మధుమేహం ఉన్నవారు కూడా దీనిని వేయించుకోవచ్చని తెలిపారు. దీని మూలంగా ఎలాంటి ఇబ్బందులు రావని ఆమె పేర్కొన్నారు. ఒక సారి క్షయతో బాధపడి తగ్గిన వారు కూడా మరోసారి రాకుండా వేయించుకోవాలని ఆమె సూచించారు. గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు అనేక చోట్ల క్షయ నిర్ధారణకు వీలుగా అనేక ఆరోగ్య కేంద్రాల్లో యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు.60 సంవత్సరాలు దాటిన వారు తప్పనిసరిగా టీకా వేయించుకోవాలని ఆమె కోరారు. దీని మూలంగా క్షయ రాదని చెప్పారు. వైద్యాధికారి లలిత, ఎంపీహెచ్ ఈవో అప్పలనాయుడు, క్షయ నివారణ సూపర్ వైజర్ వై. అచ్చియనాయుడు పాల్గొన్నారు.

ఎటపాక: గౌరిదేవిపేట పీహెచ్‌సి పరిదిలో వయోవృద్ధుల బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య,నోడల్ అధికారి డాక్టర్ రమేష్ గురువారం పరిశీలించారు. టీపీ వీడు సబ్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారుల వివరాలు తెలుసుకున్నారు.వ్యాక్సినేషన్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు దేవినాగ్, శ్రీదేవి, హెచ్‌వీ లక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి రూరల్: క్షయ వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డీఐవో సాధన అన్నారు. మండలంలోని లంబసింగి పీహెచ్‌సీని గురువారం ఆమె సందర్శించారు. వ్యాక్సినేషన్ వివరాలు తెలుసుకున్నారు. వైద్యాధికారులు దినేష్, వరప్రసాద్, ఎంపీహెచ్‌వో మురళి తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణే ప్రధానం





సమావేశానికి హాజరైన అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని

- స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత
- విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్న నిర్లక్ష్యం వద్దని, పల్లెలు, పట్టణాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని అధికారులకు సూచించారు. ఈ నెల 13న నిర్వహించిన ఎన్నికల తర్వాత జరిగిన సంఘటనలు, తీసుకోవాల్సిన భద్రత చర్యలపై విశాఖ రేంజ్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు, ఇతర పోలీస్ అధికారులతో విజయనగరం జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం, జూమ్ మీటింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా రేంజ్ పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించడం వల్ల చిన్న చిన్న సంఘటనలు మినహా ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించుకోగలిగామన్నారు. అందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. మరో 15 రోజులు ప్రతిఒక్కరూ ఇదే నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని, మన ప్రాంతంలో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా క్షేత్ర స్థాయిలో మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలింగ్‌కు కొద్దిరోజుల ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ తర్వాత గ్రామాల్లో చిన్నచిన్న సంఘటనలు జరిగిన గ్రామాల్లో పర్యటించాలన్నారు. గ్రామస్తులతో మాట్లాడి వివాదాలను పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో రాజకీయంగా వివాదాలు సృష్టించే వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. అవసరమైతే పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులను గుర్తించి, వారు గ్రామానికి ఏ పనిమీద వచ్చారు, ఎందుకు వచ్చారన్న విషయం తెలుసుకోవాలని, ఆయా అంశాలను పాయింట్ బుక్‌లలో నమోదుచేయాలని ఆదేశించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత

ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటుచేసినట్లు విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతరం అధికారుల తనిఖీలు చేపట్టి, భద్రతను పర్యవేక్షించాలన్నారు. జూన్ 4న కౌంటింగ్ నిర్వహించే కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, వాటిని జిల్లా ఎస్పీలు ముందుగానే సమీక్షించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అనకాపల్లి, ఏఎస్ఆర్ జిల్లాల ఎస్పీలు ఎం.దీపిక, విక్రాంత్ పాటిల్, జి.ఆర్.రాధిక, కె.వి.మురళీకృష్ణ, తుహిన్ సిన్హా, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అదనపు ఎస్పీలు అస్మా ఫర్హీన్, ప్రేమ్‌కాజల్, దిలీప్ కిరణ్, పార్వతీపురం ఏఎస్పీ సునీల్ షరోన్, ట్రెయినీ ఐపీఎస్ ఎం.జావలి, డీఎస్పీలు పి.శ్రీనివాసరావు, ఆర్.గోవిందరావు, ఎ.ఎస్.చక్రవర్తి, జి.మురళీధర్, జి.వి.కృష్ణారావు, ఎస్.అప్పలరాజు, బి.అప్పారావు, కె.వి.సత్యనారాయణ, డి.బాలచంద్రారెడ్డి, వై.సునీత, జి.నాగేశ్వర రెడ్డి, ట్రెనీ డీఎస్పీలు ఎస్.మహేంద్ర, సీహెచ్.రాజా, పలువురు సిఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చందనం విక్రయాలు ప్రారంభం



చందనం ప్యాకెట్లను అందజేస్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై గురువారం నుంచి చందనం విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి ప్రసాద విక్రయశాలలోని కౌంటరులో సుమారు 10 గ్రాముల చందనం ప్యాకెట్‌ను రూ.10 చొప్పున విక్రయించారు. దేవస్థానం ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ పలువురు భక్తులకు ఈ ప్యాకెట్లను అందజేశారు. ఈ నెల 17, 19, 20, 21 తేదీల్లో మాత్రమే చందనం విక్రయిస్తారు. కాగా.. చందనం కొనుగోలు చేసేందుకు భక్తులు బారులుదీరారు.

22న సింహగిరిపై నృసింహ హోమం

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 22న పెద్ద ఎత్తున శ్రీ నృసింహ హోమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ నెల 22న నృసింహ జయంతి, శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి జన్మ నక్షత్రమై స్వాతి నక్షత్రం కలిసి వచ్చాయని వివరించారు. ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న విశాల ప్రాంగణంలో జరిగే ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులను భాగస్వాములను చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నృసింహ హోమంలో పాల్గొనే భక్తులు రూ.2,500 టికెట్‌ను www.aptemples.ap.gov.inలో తీసుకుని ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ పాల్గొనవచ్చని తెలిపారు. అలాగే సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో కూడా టికెట్లు లభిస్తామని వివరించారు.

ఇగ్నో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జూలై ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులు https:// ignouadmission.samarth.edu.in/ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు జూన్ 30 చివరి తేదీ అని, మరిన్ని వివరాలకు ఎంవీపీకాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

ఐఏసీ బాహుబలి విశాల్





- భారత మూడో ఎయిర్ క్రాఫ్ట్ కేరియర్ 'ఐఎన్ఎస్ విశాల్'
- రూ.50 వేల కోట్లతో నిర్మాణం.. 2030 కల్లా అందుబాటులోకి..
- పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారీకి ప్రణాళికలు

సాక్షి, విశాఖపట్నం: రక్షణ రంగంలో బలీయమైన శక్తిగా ఎదిగేందుకు భారత్ వినూత్న వ్యూహాలతో దూసుకువెళుతోంది. యుద్ధ విమాన వాహక నౌకల విషయంలో వెనుకబడి ఉన్న భారత్..ఆ లోటును భర్తీ చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఎయిర్ క్రాఫ్ట్ కేరియర్ల విషయంలో చైనా దూకుడుగా ఉన్న నేపథ్యంలో ఐఎన్ఎస్ విక్రాంత్ మాదిరిగా..మరో షిప్ ఐఎన్ఎస్ విశాల్‌ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసేందుకు ప్రణాళికలు రచించింది. దీంతో పాటు మరో 3 ఇండియన్ ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్ (ఐఏసీ)లు రూపొందించేందుకు విధివిధానాల్ని రక్షణ శాఖ నిర్ణయించింది. రక్షణ వ్యవస్థకు ఎన్నడూ లేని విధంగా కేంద్రం బడ్జెట్ కేటాయిస్తున్న నేపథ్యంలో..అధునాతన ఆయుధ, నౌకా సంపత్తిని సొంతం చేసుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. మూడో, అతి పెద్ద ఐఏసీకి సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. భారత నౌకాదళం ప్రస్తుతం ఉన్న ఐఏసీ-2 విక్రాంత్ కంటే పెద్దదిగా ఉండే మూడో స్వదేశీ విమాన వాహక నౌక కోసం అధ్యయనం పూర్తయింది. ప్రస్తుతం ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్‌లు సేవలందిస్తున్నాయి. విక్రమాదిత్య జీవితకాలం మరో నాలుగేళ్లలో ముగిసే అవకాశం ఉండటంతో ఈలోగా కొత్త ఐఏసీని అందుబాటులోకి తీసుకురావాలని నేవీ అధికారులు భావిస్తున్నారు.

విక్రాంత్ కంటే భారీగా..

తదుపరి నిర్మించబోయే యుద్ధ విమాన వాహక నౌక.. దేశంలోనే అతిపెద్ద ఐఏసీగా నిర్మించాలని నేవీ నిర్ణయించింది. దీనికి ఐఎన్ఎస్ విశాల్‌గా నామకరణం చేసింది. ప్రస్తుతం ఉన్న విక్రాంత్ పరిమాణం 44,000 టన్నులు కాగా.. మూడో నౌక విశాల్‌ని 65,000 టన్నుల వరకు నిర్మించాలని భావిస్తోంది. కొత్త సాంకేతికతలతో కూడిన కొత్త ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కాటాపుల్ట్ సిస్టమ్ (హైడ్రాలిక్‌తో నడిచే) ద్వారా ల్యాండింగ్ అయ్యే విధంగా నౌకా నిర్మాణ సౌకర్యాన్ని అప్‌గ్రేడ్ చేయనుంది. విక్రాంత్‌ని తయారు చేసిన కొచ్చి షిప్‌యార్డులోనే విశాల్‌ని తీర్చిదిద్దేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనికి రూ.50 వేల కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. జూలై తర్వాత విశాల్‌పై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

చైనాకు దీటుగా..

హిందూ మహాసముద్రంలో చైనా కవ్వింపు చర్యలు దేశ రక్షణ వ్యవస్థకు కంటగింపుగా మారుతున్న నేపథ్యంలో వైమానిక శక్తిని ఒక వైపు మలక్కా జలసంధి, మరోవైపు ఎడెన్ గల్ఫ్ వంటి సుదూర ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరముంది. ఈ తరుణంలో ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్లని అన్ని వైపులా మోహరించాల్సి ఉంటుంది. పశ్చిమ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న విక్రమాదిత్యని, తూర్పు తీరంలో గస్తీ కాస్తున్న విక్రాంత్‌ని మలక్కా, ఎడెన్ ప్రాంతాల్లో మోహరింపజేస్తే..భారత సముద్ర జలాల్లో మరో ఐఏసీ అవసరమవుతుంది. అందుకే..కొత్త షిప్‌ని నిర్మించాల్సి ఉంటుందని నేవీ భావిస్తోంది. చైనా అమ్ముల పొదిలో లియానింగ్, షాన్‌డాంగ్ అనే ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్స్ ఉన్నాయి. మూడో కేరియర్ ఫుజియాన్ సీ ట్రయల్స్ కూడా పూర్తి చేసుకుంది. ఇది యూకే, ఫ్రాన్స్, భారత్‌లో ఉన్న ఐఏఎఫ్‌ల కంటే అతి పెద్దది. ఈ క్రమంలో భారత్ కూడా మరో ఐఏఎఫ్ కోసం సిద్ధమవుతోంది. 2030 కల్లా విశాల్‌ని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

గాంధారి ఆకులు తిని పశువులు మృత్యువాత



సరియాపల్లి కొండలో గాంధారి మొక్కలు

- పోస్టుమార్టం నిర్వహించిన పశువైద్యశాఖ అధికారులు
- పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు నమూనాలు

పెదబయలు: మండలంలోని గోమంగి పంచాయతీ సరియాపల్లి గ్రామ సమీపంలో కొండలపై మొలకెత్తిన గాంధారి ఆకులు తిని 13 పశువులు మృతి చెందాయి. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన పాడి రైతులు కొమ్మ సుబ్బారావు, కొమ్మ వెంకటేశ్వర్లు, కొమ్మ చిట్టిబాబు తెలిపారు. తొలకరి వర్షాలకు మొలకెత్తిన గాంధారి మొక్కలు ప్రస్తుతం పూతదశలో ఉన్నాయి. వీటిని తినిన పశువులు మూడు రోజుల వ్యవధిలో 13 పశువులు మృతి చెందాయని వారు పేర్కొన్నారు. గోమంగి, గుల్లేలు పంచాయతీల్లోని కొండ ప్రాంతాల్లో మాత్రమే వీటి సంతతి ఎక్కువగా ఉంది. గురువారం కూడా పశువులు మృతి చెందడంతో పెదబయలు పశువైద్య అధికారులకు బాధిత రైతులు సమాచారం తెలియజేశారు. వెంటనే వాటికి పోస్టుమార్టం నిర్వహించి నమూనాలను ల్యాబ్‌కు పంపించినట్టు పశువైద్య అధికారి ఎం.సౌజన్యదేవి తెలిపారు. పశువుల మృతికి కారణమని చెబుతున్న గాంధారి మొక్క, పువ్వుల నమూనాలను సేకరించి జిల్లా పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారులకు పంపించినట్టు చెప్పారు. పశువులు గాంధారి మొక్కలు ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా పాడి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.

19న మోదకొండమ్మ పండగకు చాటింపు



మాడుగుల: ఈనెల 19వ తేదీన ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ పండగకు చాటింపు జరగనుందని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు చెప్పారు. 21వ తేదీన అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలను అమ్మవారి ఆలయం నుంచి కోట ప్రాంగణంలో ఉన్న సతకంపట్టు వరకు ఊరేగింపుగా తీసుకువస్తారన్నారు. వచ్చే నెల 18 వరకు అమ్మవారు సతకంపట్టు వద్ద కొలువు దీరి భక్తులకు దర్శనమిస్తారన్నారు. జూన్ 18న పండగ నిర్వహించాక తిరిగి ఘటాలు ఆలయానికి చేరడంతో అమ్మవారి నెల రోజుల పండగ ముగుస్తుందన్నారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున ఆయా స్టేషన్ల నుంచి బయల్దేరాల్సిన రైళ్లు ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు, అంతే ఆలస్యంగా ఈ రైళ్ల రాకపోకలు సాగించనున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సౌరబ్‌ప్రసాద్ తెలిపారు.

- విశాఖలో గురువారం రాత్రి 11.20 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం–లోకమాన్యతిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ సుమారు 4 గంటలు ఆలస్యంగా శుక్రవారం తెల్లవారు 3 గంటలకు బయల్దేరింది.
- సంత్రగచ్చిలో గురువారం రాత్రి 11.40 గంటలకు బయల్దేరాల్సిన సంత్రగచ్చి- తాంబరం (06090) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు నాలుగున్నర గంటలు ఆలస్యంగా శుక్రవారం తెల్లవారు 4 గంటలకు బయల్దేరింది.

ఆలస్యంగా వందేభారత్ రాకపోకలు

విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం (20833/20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ గురువారం సుమారు మూడు గంటలు ఆలస్యంగా ఉదయం 8.45 గంటలకు విశాఖలో బయల్దేరింది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్‌లో సుమారు ఐదు గంటలు ఆలస్యంగా రాత్రి 8 గంటలకు బయల్దేరింది.

వాల్తేర్ డివిజన్ 'కమర్షియల్' రికార్డ్

- ఏప్రిల్‌లో రూ.2.8 కోట్ల ఆదాయం

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ కమర్షియల్ విభాగం సిబ్బంది ఏప్రిల్ నెలలో అత్యుత్తమ పనితీరు కనబరిచి, రికార్డు స్థాయి ఆదాయాన్ని సంపాదించారు. ఏప్రిల్ నెలలో వాల్తేర్ డివిజన్ కమర్షియల్ విభాగం చేపట్టిన 47, 837 డ్రైవ్‌ల ద్వారా సుమారు రూ. 2.8కోట్లు ఆదాయాన్ని ఆర్జించగలిగారు. గత రికార్డులన్నీ అధిగమించి ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జోన్ పరిధిలోనే ఒక నెలలో అత్యధిక ఆదాయాన్ని ఆర్జించిన డివిజన్‌గా నూతన రికార్డు నెలకొల్పిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ సిబ్బందిని అభినందించారు. వాల్తేర్ డివిజన్, కమర్షియల్ సిబ్బంది అకుంఠిత దీక్ష, నిరంతర శ్రమ ఫలితంగా ఇది సాధ్యం అయిందని ప్రశంసించారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ద్వారకా స్టేషన్‌కు అప్పగించారు. వివరాలివీ.. కేరళ రాష్ట్రానికి చెందిన ప్రకాష్, సాయిదళవి ఒడిశాలో 10 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. కేరళ వెళ్లేందుకు విశాఖ వచ్చారు. రామాటాకీస్ రోడ్డులో బస్ కోసం వేచి ఉన్నారు. అయితే వీరిద్దరూ అనుమానాస్పదంగా కనిపించడంతో అటువైపు వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద గంజాయిని గుర్తించి.. ద్వారకా పోలీసులకు అప్పగించారు.

విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో స్వామికి పూజ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదిక్పై వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను బేడా మండపంలో వేదికపై వేంజేప చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

సబ్బవరం: ఉమ్మడి విశాఖ జిల్లాలోని బాలుర గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్థానిక సబ్బవరం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని సబ్బవరం, దేవరాపల్లి, గొలుగొండ, శ్రీకృష్ణాపురం గురుకుల కళాశాలల్లో ప్రవేశాల కోసం ఇప్పటికే ప్రవేశ పరీక్ష నిర్వహించి, ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆన్‌లైన్ విధానం ద్వారా సీట్లు భర్తీ చేశారు. మిగులు సీట్ల కోసం మెరిట్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి సీట్లు భర్తీ చేసేందుకు ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌కు సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆయా కళాశాలల్లో 188 సీట్లు ఖాళీగా ఉండగా, కౌన్సెలింగ్ ద్వారా 81 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. అడ్మిషన్ కౌన్సెలింగ్ చైర్మన్‌గా ఉమ్మడి జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపావతి, సభ్యులుగా ఆయా గురుకులాల ప్రిన్సిపాల్స్ సీహెచ్.వి.వి.సత్యారావు, ఆర్.రామకృష్ణ, సీహెచ్ రవీంద్రనాథ్, వి.రత్నవల్లి వ్యవహరించారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: ముంబై డివిజన్, ఛత్రపతి శివాజీ టెర్మినస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్, ఇంటర్ లాకింగ్ పనుల నిమిత్తం, ప్లాట్‌ఫాంల విస్తరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సౌరబ్‌ప్రసాద్ తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు భువనేశ్వర్‌లో బయల్దేరే భువనేశ్వర్–ముంబై సీఎస్‌టీఎం(11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ దాదర్ స్టేషన్ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జూన్ 1వ తేదీన మాత్రమే ముంబై సీఎస్‌టీఎంలో బయల్దేరాల్సిన ముంబై సీఎస్‌టీఎం-భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ దాదర్ నుంచి బయల్దేరుతుంది.

కొత్త బస్సులతో ఖుషీ!

- ఇటీవల ఆరు బస్సులు రాక
- త్వరలో మరో 40 వచ్చే అవకాశం
- వీటిలో సూపర్ లగ్జరీలు, అల్ట్రా డీలక్స్‌లు
- కాలం చెల్లిన వాటిలో కొత్తవి సర్దుబాటు



కొత్త సూపర్ లగ్జరీ బస్సు

సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీలో కొత్త బస్సుల కోలాహలం నెలకొంది. పాత బస్సుల స్థానంలో వస్తున్న ఈ నయా బస్సులతో ఆర్టీసీ ఖుషీ ఖుషీగా ఉంది. పది లక్షల కిలోమీటర్లు, 15 ఏళ్లు తిరిగిన బస్సులను కాలం చెల్లిన జాబితాలో చేరుస్తారు. ఇలాంటి వాటిని తొలగించి వాటికి బదులు కొత్తవి సమకూరుస్తారు. విశాఖ జిల్లాలో ప్రస్తుతం 40కి పైగా కాలం చెల్లిన బస్సులున్నాయి. దీంతో ఈ బస్సులు వివిధ రకాల శబ్దాలతో రోడ్లపై పరుగులు తీస్తూ ప్రయాణికులకు అసౌకర్యంగా ఉంటున్నాయి. కొన్ని బస్సుల్లో అయితే సీట్లు, కిటికీల అద్దాలు కూడా కండిషన్‌లో ఉండడం లేదు. బస్సు సస్పెన్షన్లు కూడా దెబ్బ తిని కుదుపులకు గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా వస్తున్న ఈ బస్సులు ఎంతో ఆకర్షణీయంగా, రంగులు, హంగులతో కనిపిస్తున్నాయి. సరికొత్త డిజైన్లతో పాటు లోపల సీట్లు కూడా సౌకర్యవంతగా ఉంటున్నాయి. దీంతో ఈ కొత్త బస్సులు ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకోనున్నాయి. కాగా తొలుత ఇటీవల విశాఖకు ఆరు కొత్త బస్సులను కేటాయించారు. వీటిలో మూడు సూపర్ లగ్జరీలు, మూడు అల్ట్రా డీలక్స్‌లు ఉన్నాయి. త్వరలో మరో 40 వరకు కొత్త బస్సులు రానున్నాయి. ఇందులో 34 సూపర్ లగ్జరీలు, ఆరు డీలక్స్‌లు ఉండే అవకాశం ఉంది. వీటిని ప్రస్తుతం సర్దుబాటు చేసిన దూరప్రాంత రూట్లలోను, నాన్‌స్టాప్ సర్వీసులుగాను నడుపుతారు.

కొత్త బాడీలతో సిటీ బస్సులుగా మార్పు..

మరోవైపు పది లక్షల కిలోమీటర్లు తిరిగిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ/అల్ట్రా డీలక్స్ బస్సులను సిటీ బస్సులుగా మార్పు చేయనున్నారు. ఇంజిను కండిషన్‌ను మెరుగు పరచడంతో పాటు చాసిస్‌లు బాగున్న బస్సులకు కొత్తగా బాడీలు కట్టించనున్నారు. విజయనగరంలోని జోనల్ వర్క్‌షాపులో ఈ బస్సుల మార్పు పనిని చేపట్టనున్నారు. ఇలా ఆర్టీసీ విశాఖ జిల్లాకు సంబంధించి 40–50 బస్సులను సిటీ బస్సులుగా మార్చనున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతున్న అర్చకులు



శ్రీవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పెందుర్తి : వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వక్షేణ అరాధన, పుణ్యావహవచనం, అంకురార్పణ, బుత్సంగ్రహణం, యాగాశాల అర్చన, అగ్ని ప్రతిష్ఠ జరిగాయి. వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు జరుగుతాయి. మూడో రోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం జరగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు సాగుతూ భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామి వారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. తొలిరోజు పూజల్లో ఈవో నీలిమ, ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పారిశ్రామిక శిక్షణ.. ఉపాధికి నిచ్చెన



శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

- ఐటీఐల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- పలు ట్రేడుల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు
- అందుబాటులో 3,286 సీట్లు

కంచరపాలెం: పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు త్వరగా ఉపాధి పొందే కోర్సుల్లో ఐటీఐ ఒకటి. ప్రధానంగా జిల్లా విద్యార్థులు ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్‌తో పాటు ఐటీఐ చదివేందుకు అధిక ప్రాధాన్యమిస్తారు. ఐటీఐ కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులు అప్రెంటిస్ తర్వాత పరిశ్రమల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. డాక్‌యార్డ్, ఆర్టీసీ, షిప్‌యార్డ్, రైల్వే, విద్యుత్, రక్షణశాఖ వంటి వాటిల్లో సైతం ఉద్యోగాలకు ప్రయత్నం చేసుకోవచ్చు. చదువులో ఒత్తిడి ఉండదు. అయితే విద్యార్థులకు సాంకేతిక రంగంపై నైపుణ్యాలు తప్పనిసరి. నైపుణ్యం ఉన్న విద్యార్థులకు తప్పకుండా ఉపాధి లభిస్తుంది. ఉద్యోగంతో పాటు స్వయం ఉపాధికి సైతం ఈ కోర్సులు ఎంతగానో దోహదపడతాయి.

పలు ట్రేడుల్లో శిక్షణ

- విశాఖ నగర పరిధిలో నాలుగు ప్రభుత్వ, 31 ప్రైవేట్ ఐటీఐల్లో 3,286 సీట్లు ఉన్నాయి. ఏడాది, రెండేళ్ల వ్యవధి ఉన్న ట్రేడుల్లో శిక్షణ ఇస్తున్నారు. కొన్ని ట్రేడులు 8వ తరగతి విద్యార్హతతో సైతం నిర్వహిస్తున్నారు.
- ఏడాది కోర్సులు: మెకానికల్ డీజిల్, వెల్డర్, కటింగ్ అండ్ సీయింగ్, కంప్యూటర్ ప్రోగ్రామ్ అసిస్టెంట్, ప్లంబర్, కోపా, కార్పెంటర్, స్టెనోగ్రఫీ
- రెండేళ్ల కోర్సులు: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానికల్, డ్రాఫ్ట్‌మన్ సివిల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానికల్, డీఎం సివిల్, డీఎం మెకానికల్, మిషనిస్ట్, పెయింటర్, ఐఎం కెమికల్, ఎంఎంటీఎం, ఆర్ అండ్ ఏసీ మెకానిక్, ఏవో కెమికల్
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ)కు వెళ్లి పరిశీలించుకోవాలి. దరఖాస్తులు పరిశీలన పూర్తయిన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు. జూన్ ఆఖరి తేదీలోపు ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేస్తారు. జూలై నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

ఐటీఐలో ప్రవేశాలకు నోటిఫికేషన్	ఈ నెల 08
దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం	09
దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ	జూన్ 10
సహాయ కేంద్రాల్లో పరిశీలన చివరి తేదీ	జూన్10
సహాయ కేంద్రాలు	కంచరపాలెం పాత ఐటీఐ, న్యూ ఐటీఐ గాజువాక, నరవ ఐటీఐ, బాలికల ఐటీఐ ఇండస్ట్రియల్ ఏరియా, కంచరపాలెం
ఏడాది కోర్సులు	8
రెండేళ్ల కోర్సులు	15
ప్రభుత్వ ఐటీఐల్లో సీట్లు	1,648
ప్రైవేట్ ఐటీఐలు	28
ప్రైవేట్ ఐటీఐల్లో సీట్లు	1,638
వెబ్‌సైట్	iti.ap.gov.in

మంచి స్కిల్స్‌తో బయటకు వెళ్లాలి



పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ) విద్యార్థులకు అప్రెంటిస్, స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ఏడాది కోర్సుల్లో కొత్తగా రెండు ట్రేడ్లు చేర్చాం. విద్యార్థులు ఏడాది, రెండేళ్ల కోర్సుల్లో చేరవచ్చు. షెడ్యూల్ మేరకు ఆన్‌లైన్‌లో జూన్ 10లోపు సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా హాజరై దరఖాస్తులను వెరిఫికేషన్ చేయించుకోవాలి. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను విద్యార్థి మొబైల్ నంబర్‌కు పంపిస్తాం. సందేహాలు ఉంటే ప్రభుత్వ ఐటీఐలను సంప్రదించవచ్చు. రిజర్వేషన్ రోస్టర్ బట్టి ప్రవేశాలు కల్పిస్తాం.

– జె.శ్రీకాంత్ ప్రిన్సిపాల్, కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ(ఓల్డ్), కంచరపాలెం

రైలు ఢీకొని ఒకరి మృతి

అరకులోయ టౌన్: డుంబ్రిగుడ రోడ్‌లోని కురిడి రైల్వే గేట్ సమీపంలో గురువారం మధ్యాహ్నం గూడ్స్ రైలు ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ విషయాన్ని ఆర్పీఎఫ్ ఏఎస్ఐ మోహన్‌రావు తెలిపారు. మృతుడికి 35 సంవత్సరాల వయసు ఉంటుందన్నారు.

అతని మృతదేహాన్ని అరకులోయ ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామన్నారు. అతని వివరాలు తెలిసిన వారు మార్చురీ సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు.